
సాక్షి
ఒడిశా

శనివారం । 21 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,10,676 లు, బంగారం 2 గ్రాముల 400 మిల్లీ గ్రాములు, వెండి 19 గ్రాముల 200 మిల్లీ గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

మావోయిస్టులపై రివార్డుల ప్రకటన..?

- ఎన్‌ఐఏ పేరుతో పోస్టర్లు
- చించివేసిన గుర్తు తెలియని వ్యక్తులు



-IIలో▸



విద్యతోనే అభివృద్ధి సాధ్యం

-IIలో▸

న్యూస్‌రీల్

ఉత్తమ పోలీసుస్టేషన్‌గా అస్కా



హోం మంత్రి, ఇతర ఉన్నతాధికారులతో ఉత్తమ అవార్డుతో ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్

బరంపురం: సీఎం నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలోని అస్కా పోలీసుస్టేషన్ దేశంలోనే ఉత్తమ పోలీసుస్టేషన్‌గా కేంద్ర హోం శాఖ గుర్తించింది. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ వ్యవసాయ–విజ్ఞాన భవన్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా అస్కా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు ఉన్నత పోలీసు అధికారులు అభినందనలు తెలియజేశారు.

ఈడీ విచారణకు ఎమ్మెల్యే బ్రజ్ కిషోర్



ఎమ్మెల్యే బ్రజ్ కిషోర్ ప్రధాన్

భువనేశ్వర్: తాల్చేర్ బీజేడీ ఎమ్మెల్యే బ్రజ్ కిషోర్ ప్రధాన్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణకు శుక్రవారం హాజరయ్యారు. బొగ్గు గనుల అక్రమ లావాదేవీల్లో ఆయనకు వ్యతిరేకంగా పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్సుమెంట్ డైరక్టరేట్ విచారణకు హాజరవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు గంటపాటు ఎమ్మెల్యే బ్రజ్ కిషోర్ ప్రధాన్‌ను ఈడీ విచారించింది.


మగ గజేంద్రుడు మృతి



చనిపోయిన ఏనుగును పరిశీలిస్తున్న అధికారులు

బరంపురం: గంజాం జిల్లా ఉత్తర గుముసర తారసింగ్ అటవీ ప్రాంతం బనపూర్‌లో మగ ఏనుగు మృతి చెందింది. సమాచారం అందుకున్న గుముసరా డివిజన్ తారసింగ్ అటవీ రేంజర్ కృష్ణ దాస్, ఏసీఎఫ్ విక్రమ్ దేవ్ పటాన్నయక్ బృందంతో ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారులు, గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. గత 4 రోజులుగా 13 ఏనుగుల గుంపు చికిటి బ్లాక్ పరిధిలోని గ్రామాల శివారుల్లో సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే గురువారం రాత్రి బనపూర్ గ్రామంలో ఏనుగు మృతి చెందడం చూసిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికార బృందం పశు వైద్యుల సాయంతో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే పాతిపెట్టారు. ఏనుగు మృతిపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మహ్మద్ బాజీ జయంతి



బాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొరాపుట్: స్వాతంత్య్ర సమరయోధుడు మహ్మద్ బాజీ జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో విజిలెన్స్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని మాట్లాడుతూ నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జన్మించిన బాజీ 102 ఏళ్లు జీవించిన విషయం గుర్తు చేశారు. తన యావదాస్తులు పేదలకు పంచిపెట్టి, గాంధీ ఆశయాల మేరకు బ్రహ్మచారిగా జీవించారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మనోరంజన్ త్రిపాఠీ (మున్నా) తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేత

జయపురం: స్థానిక సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బొయిపరిగుడ సమితిలోని రైతులకు వ్యవసాయ యంత్ర పనిముట్ల వితరణ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త మాట్లాడుతూ.. వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించి అధిక దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఈ పథకాన్ని బొయిపరిగుడ సమితిలోని రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు.

ఎట్టకేలకు..!

- శ్రీమందిరం వీడియో కేసు నిందితుడు అరెస్టు
- డ్రోన్ కెమెరా, మొబైల్ స్వాధీనం



పోలీసులు జప్తు చేసిన డ్రోన్ కెమెరా, సెల్‌ఫోను



పోలీసులకు చిక్కిన అనిమేష్ చక్రవర్తి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేకే హరిప్రసాద్

పూరీ: శ్రీమందిరం డ్రోన్ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన నిందితుడు అనిమేష్ చక్రవర్తిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను ఈనెల 18వ తేదీన అరెస్టు చేసి, పూరీ పట్టణ డీఎస్పీ కె.కె.హరి ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం ఒడిశా రాష్ట్రానికి తరలించింది. పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పూరీ పట్టణ డీఎస్పీ కె.కె.హరిప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందానికి చిక్కకుండా నిందితుడు పలు చోట్లకు స్థావరం మార్చినట్లు వివరించారు. నిందితుడికి వ్యతిరేకంగా పూరీ ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు అమలు నేపథ్యంలో పలు చోట్ల గాలించారు. ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పలుచోట్ల దర్యాప్తు బృందం నిరవధికంగా గాలించింది. దీంతో పశ్చిమ బెంగాల్ నిమిత పోలీసుస్టేషన్ పరిధిలో ఈనెల 18వ తేదీన పోలీసులకు నిందితుడు చిక్కినట్లు వివరించారు. పశ్చిమబెంగాల్ బారక్‌పూర్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేటు జారీ చేసిన ట్రాంజిట్ రిమాండ్ ఆధారంగా రాష్ట్రానికి తరలించారు. అరెస్టు చేసిన నిందితుని దగ్గర 1 సెల్‌ఫోను, డ్రోన్ కెమెరాని పోలీసులు జప్తు చేశారు. నిందితుడిని పూరీ ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేటు కోర్టులో ప్రవేశపెట్టారు.

ఇదీ విషయం

శ్రీమందిర్ ప్రధాన ప్రాంగణం లోపలి దృశ్యాలను డ్రోన్‌తో చిత్రీకరించి గతేడాది నవంబర్ 19వ తేదీన యూనిఫైడ్ అనిమేష్ పేరుతో యూట్యూబ్ ఛానెల్‌లో అనిమేష్ చక్రవర్తి ప్రసారం చేయడంపై సోషల్ మీడియాలో దుమారం రేపింది. దీంతో వివాదంలో చిక్కుకున్నాడు. రూ.20 వేలు చొప్పున చెల్లిస్తే ఒక్కో కోణంలో పూర్తి వీడియో క్లిప్పింగులు అందజేయడం జరుగుతుందని బాహాటంగా ప్రసారం చేశాడు. శ్రీ మందిరం నో ఫ్లయింగ్ జోన్‌లో డ్రోన్ సహకారంతో శ్రీ మందిరం శిఖరం, పతిత పావన పతాకం, శ్రీ జగన్నాథ దేవస్థానం విహంగ వీక్షణ దృశ్యాలు చిత్రీకరించాడు. ఈ నేపథ్యంలో వీడియో, ఫొటోలను పొందినందుకు అనిమేష్ ఒడిశా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ విషయమై పూరీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో శ్రీమందిరం సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్ ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు. సింహద్వారం పోలీసుస్టేషన్ అధికార వర్గాలు నాలుగు కోట్ల మంది ప్రజలకు క్షమాపణ కోరింది. ఈ వివాదం ఇలా రగలడంతో ముందస్తు బెయిల్ కోసం నిందితుడు హైకోర్టుని ఆశ్రయించాడు. ముందస్తు బెయిల్ అభ్యర్థనను హైకోర్టు జస్టిస్ చిత్తరంజన్ దాస్ ధర్మాసనం కొట్టి వేసింది.

9 భారీ ప్రాజెక్టులకు ఆమోదం

భువనేశ్వర్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. 9 కొత్త భారీ ప్రాజెక్టులకు హై లెవెల్ క్లియరెన్స్ అథారిటీ (హెచ్‌ఎల్‌సీఏ) ఆమోదం తెలిపింది. సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన హెచ్‌ఎల్‌సీఏ సమావేశంలో ఈ మేరకు ఆమోదం పొందిన 9 భారీ ప్రాజెక్టుల్లో సుమారు రూ.1.53 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలుస్తోంది. దీనివలన రాష్ట్రంలో 27 వేలకు పైగా ఉద్యోగాలు రానున్నాయి. ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో రూ.38,000 కోట్ల ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఒకటి కావడం విశేషం. భారీ పెట్టుబడులతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి లభించింది. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు ఏర్పాటు అవుతాయి. జగత్‌సింగ్‌పూర్, కొరాపుట్, కలహండి జిల్లాల్లో ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. అలాగే రూ. 58,209 కోట్లతో ఏసీఎంఈ క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. గంజాంలో అవడా ఆమోదం లభించింది. ఈ ప్లాంట్ కోసం అవడా రూ.23,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. పారాదీప్‌లోని రెన్యూ ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎఫ్‌పీఎల్) ప్లాంట్‌కు కూడా హై లెవెల్ క్లియరెన్స్ అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి అంచనా రూ.20 వేల కోట్లు. గోపాల్‌పూర్‌లో ఓసియోర్ ఎనర్జీ ఆమోదించబడింది. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ కోసం పెట్టుబడి రూ.7,200 కోట్లు. బాలేశ్వర్ రెముణాలో బ్యాంక్ నోట్ పేపర్ మిల్లుకు అనుమతి లభించింది. ఈ ప్లాంట్ పెట్టుబడి ప్రణాళిక రూ.2.05 కోట్లు ఉంటుందని అంచనా. పారాదీప్‌లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు హెచ్‌ఎల్‌సీఏ ఆమోదం తెలిపింది. ఆర్సెలార్ మిట్టల్ 7 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఉక్కు కర్మాగారాన్ని రూ.38,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుందని, ఈ ప్లాంట్ ఏర్పాటుతో 11,495 మందికి ఉపాధి లభించనుంది.

శరవేగంగా రాయగడ అభివృద్ధి



డీఆర్‌ఎం సతపతిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీలు



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

- రైల్వే డీఆర్‌ఎం అనూప్ సతపతి
- కొనసాగుతున్న చొయితి ఉత్సవాలు



ప్లాస్మా దాతలను సన్మానిస్తున్న దృశ్యం



ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

రాయగడ: పారిశ్రామిక కేంద్రమైన రాయగడ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విశాఖపట్నం రైల్వే డీఆర్‌ఎం అనూప్ సతపతి అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న చొయితి ఉత్సవాలకు గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగడ పట్టణం మరికొన్ని సంవత్సరాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ముఖ్యంగా రైల్వే పరంగా మరింత ముందుకు దూసుకుపోవడం ఖాయమని అభిప్రాయపడ్డారు. రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందిన రాయగడలో రైల్వే ఆధునికీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలే అందించేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ చర్యలు అభినందనీయం

ఒడిశా రాష్ట్రంలో కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని సతపతి అన్నారు. క్రీడలు, కళారంగానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుండటంతో దేశంలోనే ఒడిశా రాష్ట్రం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. చొయితి వంటి ఉత్సవాలు కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నాయని చెప్పారు. ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి విశేషంగా జనాలు వస్తుండడం సంతోషకరమన్నారు. చొయితి ఉత్సవాలకు ఇంతటి స్పందన రావడం ఆశ్చర్యకరమన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతిని ప్రతిబింబించే ఈ ఉత్సవాలు వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కొరాపుట్ జిల్లా ఎస్పీ అవినవ్ శంకర్, కొరాపుట్ డీఐజీ పండిత్ రాజ్ ఉత్తమ కుమార్, అటవీ శాఖ అధికారి మానస్ రాజ్ పటేల్, విశాఖపట్నం రైల్వే సీనియర్ డీసీఎం ప్రీతీ రాణా తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులకు కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మలు సాంప్రదాయ లంజియా సవర తెగకు చెందిన ఆదివాసీలచే రూపొందించబడిన సాలువాలతో సత్కరించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్లాస్మా దానం చేసిన ఐదుగురు యువకులను సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చొయితి రెండోరోజు ఉత్సవాల్లో భాగంగా కంధమాల్ జిల్లా కళాకారులచే ప్రదర్శించబడిన ఆదివాసీ నృత్యం అలరించగా, బిసంకటక్‌లోని ఆదర్శ విద్యాలయానికి చెందిన విద్యార్థులు దేశభక్తిపై ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది.అదేవిధంగా జేకేపూర్‌లోని మహిళా క్లబ్‌కు చెందిన మహిళలు ప్రదర్శించిన అస్సామి నృత్యం రంజింపజేసింది.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. కొరాపుట్ జిల్లాలో భారత్ జోడో సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేసినందుకు స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపం ప్రాంగణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దీనిలో భాగంగా ఒడిశా రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఈనెల 26న నవరంగపూర్, 27వ తేదీన జయపురంలో యాత్ర నిర్వహిస్తారని వెల్లడించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్ర దేశంలో విజయవంతంగా సాగుతోందన్నారు. కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బినోద్ మహాపాత్రో, మదన మోహన్ నాయిక్, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ పాల్గొన్నారు.

ఢిల్లీలో సాహి జతా ప్రదర్శన



సాహి జతా సాధనలో కళాకారులు

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవంలో భాగంగా న్యూఢిల్లీ కరియప్ప పేరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో పూరీ సాహి జతా ప్రదర్శించబడుతుంది. పేరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే వందే భారతం నృత్యోత్సవంలో సాహి జతా కళ ప్రదర్శన స్థానం పొందడం విశేషం. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది కళాకారులు తమ ప్రతిభను ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు. పూరీకి చెందిన రంగశాల సంస్థకు చెందిన కళాకారులు నాగ, రావణ, కాళీ, దుర్గా వేషధారణ నృత్యాలతో ప్రేక్షకులను అలరించనున్నారు. కటక్, భువనేశ్వర్‌కు చెందిన ఒడిస్సీ, మయూర్‌భంజ్‌కు చెందిన చౌ నృత్యం సైతం ఈ నృత్యోత్సవంలో ప్రదర్శించబడతాయి. విక్రమ్ సాహు నేతృత్వంలో శ్యామ్ సుందర్ మహాపాత్రా, సత్యబాన్ రౌత్, మంటూ సాహు, బొసాంత్ కుమార్ ప్రధాన్, గోపీనాథ్ ప్రధాన్, ఆర్.ప్రధాన్, దేబాశిష్ సింగ్ సాహి జతా నృత్య ప్రదర్శనలో ప్రధాన నృత్య కళాకారులుగా పాల్గొంటారు. రంగశాల అధినేత విక్రమ్ సాహు ఆధ్వర్యంలో 8 మంది సభ్యుల నృత్య బృందం ఢిల్లీలో ప్రాక్టీస్ కొనసాగిస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద డాన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శనలకు అవకాశం లభించడంపై కళాకారులు ఉత్సాహంగా ఉన్నారు.

అమ్మవారికి స్థలం కేటాయింపు

- రైల్వే బోర్డు సుముఖత



మజ్జిగౌరి అమ్మవారు



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌ఎం సతపతి



మేనేజింగ్ ట్రస్టీ బిడిక

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం రాయగడ మజ్జిగౌరి మందిరం పరిసరాల్లోని సుమారు 6.30 ఎకరాల రైల్వే స్థలాన్ని అమ్మవారికి కేటాయించేందుకు రైల్వే బోర్డు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్ సతపతి మీడియాకు వివరాలు వెల్లడించారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న చొయితి ఉత్సవాలకు గురువారం హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రైల్వే స్థలాన్ని మందిరానికి ఇవ్వాల్సిందిగా, అందుకు బదులుగా అమ్మవారికి చెందిన స్థలాన్ని రైల్వే బోర్డుకు ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం, మందిరం ట్రస్టీలు రైల్వేబోర్డును కోరాయన్నారు. దీనికోసం గత కొన్నేళ్లుగా ఇరువర్గాల మధ్య జరిపిన చర్చలు ఫలించాయని వెల్లడించారు. దీంతో మందిరం మరింత అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమయ్యిందన్నారు.


సంతోషకరం: మందిరం మేనేజింగ్ ట్రస్టీ బిడిక మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వందలాది మంది భక్తులు వస్తుంటారని, వారి సౌకర్యార్థం కొంతమేర సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపరచలేకపోతున్నామని మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం, జిల్లా యంత్రాంగం సహకారంతో రైల్వే స్థలం కేటాయింపుకు ఆమోద ముద్ర పడడం సంతోషకరమైన విషయమన్నారు. ఇకపై అభివృద్ధికి శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఇప్పటికే అమ్మవారి పేరిట కానుకలు, ఇతర రూపాల్లో వచ్చిన ఆదాయం సుమారు రూ.30 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు వివరించారు. అభివృద్ధి ప్రతిపాదనలను ఎండోమెంట్ కమిషన్‌కు త్వరలో పంపిస్తామని తెలియజేశారు.

మొసళ్ల లెక్కింపు ప్రారంభం


బరంపురం: గంజాం జిల్లాకే గర్వకారణంగా పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించే గోడాహడ్ నది డ్యామ్‌లో మొసళ్ల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కరోనా కారణంగా రెండేళ్ల తర్వాత గంజాం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో 10 బృందాలుగా అటవీ అధికారులు విడిపోయి లెక్కింపు చర్యలు చేపట్టినట్లు డీఎఫ్‌వో అముల్యా కుమార్ ప్రధాన్ తెలియజేశారు. 8 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా అటవీ శాఖ ఇక్కడ మొసళ్ల సంతాన అభివృద్ధి చర్యలు చేపట్టింది. ఈ డ్యామ్‌లో 5 మొసళ్లతో ప్రారంభించగా, ప్రతీ ఏడాది వీటి సంతాన అభివృద్ధి సంఖ్య పెరుగుతూ 2020 నాటికి 55కి చేరింది.



డ్యామ్ ఒడ్డున సంచరిస్తున్న మొసలి



డ్యామ్‌లో సంచరిస్తున్న మొసలి



ఒడ్డున సంచరిస్తున్న మొసళ్లు

క్లుప్తంగా

రిమ్స్‌లో ముగ్గురు స్టాఫ్‌నర్సులకు సెలవుల్లో కోత

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న ముగ్గురికి సెలవుల్లో కోత విధిస్తూ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ అటెండెంట్స్ తప్పనిసరి చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే రిమ్స్‌లో పనిచేస్తున్న టి.షర్మిల, ఎం.సుజాతారావు, సీహెచ్ మల్లీశ్వరి అనే స్టాఫ్‌నర్స్‌ల హాజరులో తేడాలు కనిపిస్తూ ఉండడంతో కొందరు స్టాఫ్‌నర్స్‌లు వారికి అధికారిగా ఉన్న నర్సింగ్ సూపరింటెండెంట్‌కు గురువారం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తొలుత జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఇకమీదట ఇలా జరగదని చెప్పడంతో తొలి తప్పుగా భావించి ఒక్కొక్కరికీ మూడు సెలవులను రద్దు చేయాలని ఆదేశించారు. ఫేషియల్ హాజరుకు సంబంధించి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఉద్యాన పంటల తెగుళ్లపై పరిశోధన



ఉద్దానంలో కొబ్బరికి సోకుతున్న తెగుళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

మందస: ఉద్దానంలో కొబ్బరి, జీడి పంటలకు సోకుతున్న తెగుళ్లు, వాటిని ఎలా నివారించాలో తెలుసుకోవడానికి ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మందస మండలంలోని ఉద్దానంలో పర్యటించారు. సీనియర్ ఎక్స్‌టెన్షన్, డెవలప్‌మెంట్ అధికారి కృష్ణారావు, బృందం భేతాళపురం ప్రాంతంలో తోటల్లో పర్యటించి, తెగుళ్లపై పరిశోధనలు చేపట్టారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముందుగా ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో పంటలకు సోకుతున్న తెగుళ్లను పరిశీలించారు. రైతులు తాడల అప్పలస్వామి, పూజారి కామయ్య, బత్తిని ఉమాపతి తదితర రైతులతో కలసి తెగుళ్లు, నష్టం, మందులు తదితర వాటిపై ఆరా తీశారు. నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. స్థానిక రైతులకు తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులను వివరించారు. అనంతరం బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్దానంలో రైతుల కష్టాలను తీర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కొబ్బరి, జీడి పంటలకు ఇటీవల ఇబ్బంది పెడుతున్న తెగుళ్లపై యూనివర్సిటీలో పరిశోధనలు జరపాలని కోరినట్టు తెలిపారు. ఉద్దానంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగులకు మేలు



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మితులసి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులకు మెరుగైన వైద్య సేవలను, నాణ్యమైన మందులను అందజేస్తున్నామని సహాయ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.లక్ష్మితులసి అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ నగర్‌లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. జిల్లాలో ప్రతి నెల 26 రోజుల్లో 30 ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. వైద్య శిబిరంలో సుగర్, బీపీ, ఈసీజీ, ఇతర రక్త పరీక్షలు వంటి అనేక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను రోగులకు ఉచితంగానే అందజేస్తున్నామని తెలిపారు. గర్భిణులకు కూడా నెలనెలా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

కమ్మసిగడాం జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ


రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కమ్మసిగడాం ఆలయ ప్రాంగణంలో జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి జగన్నాథ సరక



గజపతి ఉత్సవాల సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం



ఒడిస్సీ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



సర్టిఫికెట్లతో కళాకారులు



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి జగన్నాథ సరక, తదితరులు



కాశీనగర్ కళాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: జిల్లాలోని కళలు, సంస్కృతి, టూరిజం అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన జాతులు, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో జరుగుతున్న గజపతి ఉత్సవాల్లో గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లా గంగ వంశం మహారాజుల నుంచి అనేక మంది గజపతి మహారాజులు పర్లాకిమిడి సంస్థానాన్ని నడిపించారన్నారు. ప్రత్యేక ఒడిశా రాష్ట్రం కోసం, పాయక్ విద్రోహ పోరాటంలో 18 మంది గిరిజనులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని, మరో 25 మంది అండమాన్, నికోబార్ జైళ్లలో ముగ్గిపోయారని గుర్తు చేశారు. బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా మాట్లాడుతూ కోవిడ్ ప్రభావంతో రెండేళ్ల తర్వాత ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతంలో కళలకు పునరుజ్జీవం ఇవ్వాలన్నారు. అనంతరం గజపతి ఉత్సవ్ 2023 సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో దక్షిణ ఒడిశా స్వాతంత్ర్య గిరిజన అభివృద్ధి పర్యవేక్షణ అధికారి ఉపదేష్ట ప్రదీప్ మరియు, కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, జిల్లా ప్రత్యేక అభివృద్ధి చైర్మన్ మరియం రైయితో, ఎస్డీసీ వైస్ చైర్మన్ ధనేశ్వర భుయ్యాన్, రాయగడ ఎస్డీసీ అనసూయా మఝి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కుంతలా మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న పలువురికి అవార్డులు అందజేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మావోయిస్టులపై రివార్డుల ప్రకటన..?

- ఎన్ఐఏ పేరుతో పోస్టర్లు
- చించివేసిన గుర్తు తెలియని వ్యక్తులు



కోరాపుట్ బస్టాండ్‌లో వెలసిన పోస్టర్లు



మావోయిస్టు నాయకుడు ఉదయ్ ఫొటోతో ఉన్న పోస్టర్



మల్కన్‌గిరి జిల్లాకి చెందిన రంజు కిలో చిత్రంతో ఉన్న పోస్టర్

కొరాపుట్: మావోయిస్టు అగ్రనేతల తలలపై ఎన్ఐఏ రివార్డులు ప్రకటించింది. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ వద్ద పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లలో ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లోని దండకారణ్య ప్రాంతంలో వాంటెడ్ జాబితాలో ఉన్న అగ్రనేతల చిత్రాలు, వారి తలలపై ఉన్న రివార్డుల వివరాలు ఉన్నాయి. ఉదయం ఈ పోస్టర్లను చూసి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు వీటిని చించివేశారు. ఎన్ఐఏ ప్రకటించిన వారిలో తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా చిట్యాల పోలీసుస్టేషన్ పరిధిలోని వెల్లిసాల గ్రామానికి చెందిన గుజ్రాల రవి అలియాస్ ఉదయ్ ఉరఫ్ గణేష్ (ఆనంద్) తలపై రూ.10 లక్షలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఉరఫ్ శివ (బాబు) తలపై రూ.5 లక్షలు, మల్కన్‌గిరి జిల్లా పేపర్ మెట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని కడగుమ్మ గ్రామానికి చెందిన రంజు ఖిలో అలియాస్ చంటి ఉరఫ్ బిషాంత్ (బింగ్ శాంత) తలపై రు.3 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఈస్ట్ గోదావరి జిల్లా అడ్డతీగల ప్రాంతంలోని రామవరం మండలం దబ్బపాలేంకి చెందిన జలుమూరి శ్రీను బాబు అలియాస్ సునీల్ ఉరఫ్ రినో తలపై రు.5 లక్షలు తదితరులు ఉన్నారు. వీరి వివరాలు తెలిసిన వారు పోస్టల్ ద్వారా న్యూఢిల్లీ, కోల్‌కత కార్యాలయాలకు సమాచారం ఇవ్వాలని, లేదా 011 24368800 నంబర్‌కి ఫోన్‌చేసి వివరాలు తెలియజేయాలని కోరారు. వివరాలు అందించిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని ఎన్ఐఏ పేర్కొంది. అయితే ఈ పోస్టర్లపై తమకు ఎటువంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

బరంపురం: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత్ భోయి పిలుపునిచ్చారు. స్థానిక తులసీ నగర్ కల్యాణ మండపంలో మాజీ కార్పొరేటర్ ఆర్.మురళీమోహన్ పుట్టినరోజు సందర్భంగా రాధాకృష్ణ వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ప్రమాద సమయంలో రక్తం సమయానికి లభించక అనేకమంది ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని సూచించారు. బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎంసీ కార్పొరేటర్లు, గంజాం బీజేడీ అధ్యక్షుడు చాప్ పట్నాయక్ తదితరులు రక్తదానం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టీమ్ సభ్యులతో ముఖ్య అతిథి హరీష్ తదితరులు

జయపురం: స్థానిక విక్రమదేవ్ అటానమస్ కళాశాల క్రీడా మైదానంలో జయపురం సన్నీ క్రికెట్ క్లబ్ నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను సబ్ డివిజన్ పోలీసు అధికారి హరిష్ బీజసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో క్రికెట్ ఆటను విస్తరింపజేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు దివంగత గోపాలకృష్ణ పటానాయక్, దివంగత శరత్ చంద్ర త్రిపాఠీల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలియజేశారు. వీటిలో స్థానికంగా రెండు టీమ్‌లు కాగా, మిగతా టీములు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి తైక్వాండో శ్రీను తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ కల్యాణ మండపం వేదికగా ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు మొదలవుతాయన్నారు. క్యాడె ట్స్, సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ నా లుగు వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరు గా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. జూనియర్స్, క్యాడెట్స్ విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులను అనకాపల్లిలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అలాగే జూనియర్స్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులను ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అక్కడ రాణించిన క్రీ డాకారులు జాతీయ పోటీలకు ఎంపికవుతారని తై క్వాండో శ్రీను వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటల్లోగా తమ వివరాలను నమోదుచేసుకోవాలని, మరిన్ని వివరాలకు 89195 91457 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ జాగాపై అక్రమార్కుల పాగా

- నరసన్నపేటలో డీసీఎంఎస్ స్థలం కబ్జాకు యత్నం
- స్థలాన్ని పరిశీలించిన డీసీఎంఎస్ అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు



కబ్జాకు గురైన డీసీఎంఎస్ స్థలం



పాత గిడ్డంగులను తొలగించి నేల మట్టం చేసిన వైనాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ అధికారులు

నరసన్నపేట: ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నరసన్నపేట ప్రాంతంలో స్థలాలకు బహిరంగ మార్కెట్‌లో విలువ పెరగడంతో ప్రభుత్వ జాగాలపై కన్నేసి కబ్జా చేస్తున్నారు. దీంట్లో భాగంగా డీసీఎంఎస్‌కు చెందిన విలువైన స్థలంపై కొందరు వ్యక్తులు కన్నేశారు. జమ్ము రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబర్ 107/9 లో 1.76 ఎకరాల విస్తీర్ణం గల స్థలం డీసీఎంఎస్‌కు ఉంది. ఈ స్థలాన్ని జమ్ముకు చెందిన కొందరు వ్యక్తులు కాజేయడానికి ప్రయత్నించి రాత్రికి రాత్రి అక్కడ ఉన్న మొక్కలను తొలగించి పాత గిడ్డంగులను నేల మట్టం చేశారు. ఖాతా నంబర్ 963 ప్రకారం 1.76 ఎకరాల స్థలం పర్లాకిమిడి రోడ్డుకు ఆనుకుని ఉంది. ఇక్కడ సెంటు విలువ రూ.10 లక్షలకు పైగా పలుకుతోంది. ఈ విలువైన స్థలం కాజేయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విస్తీర్ణంలో ఇప్పటికే కొంత భూమిని జమ్ముకు చెందిన వారు సాగు చేస్తున్నారు. ఈ సాగు పొలానికి ఆనుకొని ఉన్న పాత గిడ్డంగులు తొలగించి వాటిని నేల మట్టం చేసే పనికి కూడా పూనుకున్నది వారేననే అనుమానం వ్యక్తం అవుతుంది. ఈ స్థలం తమది అని సర్వ హక్కులు తమకే ఉన్నాయని ఆక్రమణదారులు వాదిస్తున్నారు.

ఈ స్థలంపై ఇటీవలే నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం రికార్డులను పరిశీలించి ఎస్ఎల్ఆర్ ప్రాప్తికి డీసీఎంఎస్ సంస్థకు పాస్ బుక్ ఇచ్చారు. వన్-బీ డీసీఎంఎస్ పేరునే వస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారులు గురువారం రాత్రి పాత గిడ్డంగులను తొలగించి నేలమట్టం చేసి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి చూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సింహాచలం వెంటనే స్పందించి వీఆర్వో సూర్యనారాయణను పంపి వివరాలు సేకరించారు. ఆక్రమణ నిర్ధారణ కావడంతో సమాచారాన్ని డీసీఎంఎస్ అధికారులకు తెలియజేశారు.

స్థలం పరిశీలన

తమ సంస్థకు చెందిన స్థలం అన్యాక్రాంతమవుతున్నట్లు తెలుసుకున్న బిజినెస్ మేనేజర్ పొందరి లక్ష్మణరావు, బీఎం-2 జగ్గునాయుడు, సిబ్బంది పృథ్వీ, రమేష్‌లు శుక్రవారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉన్న పాత గిడ్డంగులను తొలగించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఆక్రమణదారులపై నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ స్థలం పక్కాగా డీసీఎంఎస్‌కు చెందినదని, పూర్తి హక్కులు వారికే ఉన్నాయని చెప్పారు.

అన్యాక్రాంతం కానివ్వం

జిల్లాలో డీసీఎంఎస్‌కు విలువైన స్థలాలు ఉన్నాయని, వీటిల్లో జమ్ము రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న స్థలం ఒకటని డీసీఎంఎస్ చైర్ పర్సన్ సల్ల సుగుణ దేవరాజ్ అన్నారు. ఈ స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుసుకున్న ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్థలం వద్ద బోర్డులు పెడతామని, చుట్టూ కంచె ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



తెలియ-6 టీమ్ సభ్యులతో అతిథులు, అధికారులు

జయపురం: రాష్ట్రంలో హాకీ ప్రపంచ కప్ జరుగుతున్న సందర్భంగా ప్రజలకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు పంచాయతీ స్థాయిలో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జాముండ పంచాయితీలో శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలో తొలి విజేతగా జాముండ పంచాయతీ తెలియ గ్రామానికి చెందిన తెలియ-6 టీమ్ విజయం సాధించింది. పోటీలను పంచాయతీ సర్పంచ్ మానధర గదబ, సమితి సభ్యులు సామరు గదబలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర మహాపాత్రో మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. జాముండ పంచాయతీలో క్రీడలను ప్రోత్సహించేందుకు త్వరలోనే క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జీఆర్ఎస్ స్వాగత సాహు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ తనిఖీ

లావేరు: మండలంలోని సుభద్రాపురం గ్రా మంలో గల రెహా వాటర్‌ప్లాంట్‌లో శుక్రవారం విజిలెన్సు, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె.వెంకటరత్నం, విజిలెన్స్ ఏఈ రవికుమార్, విజిలెన్సు ఎస్ఐ రామారావులు వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్లాంట్‌లో తయారు చేస్తున్న వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను పరీక్షల కోసం తీసుకెళ్లారు. నిబంధనలు పాటించని కారణంగా యాజమాన్యంపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఖాతాలలో జమ

పార్వతీపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో 2020 – 21, 2021 – 22 విద్యా సంవత్సరంలో ఎంపిక కాబడిన, రెన్యువల్ చేసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ రుసుమును విద్యార్థుల ఖాతాల్లో జమ చేసినట్లు డీఈఓ ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ విద్యా మంత్రిత్వ శాఖ అధికారులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లను జమ చేశారన్నారు. బ్యాంకు ఖాతా వివరాలను తప్పుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు నగదు జమచేయడం వీలుకాకపోవడం వల్ల ఆయా విద్యార్థులు అప్లికేషన్‌లో నమోదు చేసిన మొబైల్ నంబరుకు ఎస్‌ఎంఎస్ సందేశాన్ని పంపడం జరిగిందన్నారు. స్కాలర్‌షిప్ జమకాని విద్యార్థులు స్టూడెంట్ లాగిన్‌లో వివరాలు సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు.

ఈ క్రాప్ మేరకు ధాన్యం కొనుగోలు

- జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు

పార్వతీపురం: ఈ క్రాప్ చేసిన రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి నిర్ణయించింది. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు చిన్న చిన్నలోటుపాట్లు మినహా చక్కగా సాగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంకు సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్టు వెల్లడించారు. జేసీ ఒ.ఆనంద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 188 ఆర్‌బీకేల ద్వారా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసినట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ రబీకి అపరాలు, చోడి, వేరుశనగ, వరి విత్తనాలు 1170 క్వింటాళ్లను 50 శాతం, 90 శాతం రాయితీపై సరఫరా చేశామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం నాగార్జున, జిల్లా ఉద్యానఅధికారి కేఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎ. ఈశ్వరరావు, జిల్లా సూక్ష్మనీటి అధికారి ఎల్.శ్రీనివాసరావు, పౌరసరఫరాల సంస్థ జీఎం ఎం. దేవ్ముళనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా ధాన్యం రాకుండా చర్యలు



పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఒడిశా నుంచి ఆంధ్రాకు ధాన్యం అక్రమ రవాణాకు చెక్‌పెట్టే చర్యలు చేపట్టామని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో మార్కెట్ యార్డు వద్ద మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం దాడులు జరిపారు. ధాన్యం ఎక్కువగా రవాణా జరుగుతున్న పార్వతీపురంలో ఏంవీఐలు సత్యనారాయణ, వరప్రసాద్, పాలకొండలో నవీన్‌కుమార్, వేణుగోపాలరావు, సాలూరులో ప్రసాద్, కాశీరాంలు ప్రత్యేక బృందాలుగా ఎర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నిఘా నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం సేకరణ చివరిదశకు చేరిందన్నారు.

చింతలబెలగాంలో ఏనుగుల గుంపు



చింతలబెలగాం వద్ద రహదారిపైకి వస్తున్న గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఏనుగుల గుంపు దర్శనమిచ్చింది. చింతలబెలగాం, గిజబ రహదారిపై సంచరించడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. రాత్రి సమయాన బాసంగి, వెంకటరాజపురం, పెదకుదమ, చినకుదమ గ్రామ పరిసరాల్లోకి వచ్చే అవకాశం ఉందని, ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

భోగాపురం: మండలంలోని సుందరపేట, తోటపల్లి బస్ స్టాప్ కూడళ్ల వద్ద ఎస్‌ఐ కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నాతవలస చంపావతి, రామచంద్రపేట ఉప్పుగెడ్డ నదుల నుంచి భోగాపురం వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేయగా, ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేశారు.

మీ క్షేమమే.. కుటుంబానికి రక్షణ

- జిల్లా కేంద్రంలో ప్రారంభమైన రహదారి భద్రతా వారోత్సవాలు
- ఈ నెల 24 వరకు వారోత్సవాల నిర్వహణ
- పట్టణంలో బైక్ ర్యాలీతో అవగాహన

పార్వతీపురం టౌన్:

మీ క్షేమమే.. మీ కుటుంబానికి రక్షణ అని, వాహనచోదకులు రహదారి భద్రత నియయ నిబంధనలను విధిగా పాటించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతావారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 24 వరకు రహదారి భద్రత వారోత్సవాలు సాగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్ట రీత్యా నేరమన్నారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించిన అంశాల పరిష్కారానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. చాలాచోట్ల బ్లాక్ స్పాట్స్ గుర్తించి సేఫ్టీ స్పాట్లుగా మార్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. అతివేగం ప్రమాదకరమన్నారు. చాలా ప్రమాదాల్లో ఎలాంటి తప్పుచేయనివారు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. 90 శాతం రోడ్డు ప్రమాదాలకు మానవతప్పిదాలే కారణమన్నారు. అనంతరం ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఏఎంవీఐలు సత్యనారాయణ, వరప్రసాద్, రమేష్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ వై.సింహాచలం, ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు, వాహనచోదకులు పాల్గొన్నారు.



జెండాఊపి రహదారి భద్రతా వారోత్సవ బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

జిల్లాలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాద వివరాలు...	
మండలాలు:	15
రెవెన్యూ గ్రామాలు:	980
పోలీస్ స్టేషన్లు:	21
రహదారి ప్రమాదాలు:	267
మృతి చెందినవారు:	75
గాయపడిన వారు:	439

అవగాహన తప్పనిసరి



రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి. వాహనచోదకులు నిర్లక్ష్యంవహిస్తే ప్రాణాలకే ప్రమాదం. హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలి. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చెయకూడదు.

– శశికుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, పార్వతీపురం మన్యం

యువతతోనే మార్పు సాధ్యం



యువతలో మార్పుతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం. అతివేగం, ఏమరపాటు డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వందలాది మంది ప్రాణాలు విడుస్తున్నారు. మరింతమంది క్షతగాత్రులవుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు, జైలు శిక్ష విధిస్తారు. రిజిస్ట్రేషన లేకుంగా విహానాలు నడపడం చట్టరీత్యా నేరం. ఈ నెల 24 వరకూ జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తాం. రోడ్డు నిబంధనలు వివరిస్తాం.

– సి.మల్లిఖార్జున రెడ్డి, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసు విషయమై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ ఎం.దీపికాపాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు శుక్రవారం సంఘటన జరిగిన ప్రదేశంతో పాటు, రహదారి పక్కనే పలుచోట్ల ఉన్న సీసీ ఫుటేజ్‌లను తనిఖీ చేశారు. ఈ నెల 16న వెలగవలస సమీపంలోని మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. గుర్తు తెలియని మృతదేహంపై కత్తిపోట్లు ఉండడంతో హత్య కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ దీపికాపాటిల్, బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు పరిశీలించారు. మృతదేహం లభ్యమైన విషయంపై అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని వారు ఆదేశించారు. దీనిపై గురువారం ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు, క్లూస్ టీం, పలువురు పోలీసులు వచ్చి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లడం, సీసీ ఫుటేజ్‌లను పరిశీలించడం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హత్య కేసుకు సంబంధించి తాము అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామని, మృతదేహంపై ఉన్న ఆనవాళ్ల ఆధారంగా ఆ వ్యక్తిగానీ, మిస్సింగ్ గురైన వ్యక్తుల వివరాలు తెలిసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మృతదేహంతో పాటు అతని వివరాలు తెలిపే వాల్‌పోస్టర్లు గ్రామాల్లోను, రోడ్ల కూడళ్లలో అతికించామని చెప్పారు.



పెరుమాళిలో సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు

రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ మృతి



బంగారు రాజు మృతదేహం

అద్దంకి: ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వంట మాస్టర్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని అద్దంకి –నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని రెడ్డికంచేరు గ్రామానికి చెందిన తాతారావు కుమారుడు బి.బంగారు రాజు అలియాస్ రెడ్డి (35) చిన్న వయసులోనే అద్దంకి వచ్చి హోటల్స్‌లో సర్వర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం ఒక మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు విజయనగరం జిల్లా లోని స్వగ్రామానికి వెళ్లాడు. శింగరకొండ నుంచి ఆటోలో ఎక్కి వస్తుండగా, పట్టణంలోని అద్దంకి– నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి మధ్యలోని డివైడర్ ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. సీఐ రాజమోహన్, ఎస్‌ఐ సమందర్‌వలి ప్రమాద స్థలానికి చేరుకుని వివరా లు సేకరించారు. మృతుడి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పోటీలకు సిద్ధమవుతున్న జిల్లా జట్లు

క్రీడా పోటీలకు వేళాయె..

- జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు
- 23 నుంచి అలుగోలులో అండర్–17 కబడ్డీ పోటీలు
- 30 నుంచి పార్వతీపురంలో అండర్–14,17 విభాగాల్లో ఆర్చరీ పోటీలు
- పోటీల్లో పాల్గొననున్న 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసిన ఎస్‌జీఎఫ్
- కబడ్డీ పోటీల నిర్వహణకు రూ.లక్ష విరాళమిచ్చిన జెడ్పీచైర్మన్
- పోటీల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు అతిథ్యమివ్వనున్న అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విజయనగరం:

పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడాప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహించే స్కూల్‌గేమ్స్ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా అతిథ్యమివ్వనుంది. కరోనా నేపథ్యంలో గడిచిన రెండేళ్లు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించకపోగా.. ఈ ఏడాది పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జిల్లాలో అండర్–17 విభాగంలో బాల, బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించనుండగా.. అండర్–14,17 వయస్సుల విభాగాల్లో ఆర్చరీ పోటీలు నిర్వహించేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏర్పాట్లు చేస్తోంది.

అలుగోలులో కబడ్డీ పోటీలు..

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా... జిల్లాలోని నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 23 ,24, 25 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో అండర్–17 విభాగంలో బాల, బాలికల జట్లు తలపడనున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.లక్ష మొత్తాన్ని ఇప్పటికే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులకు అందజేశారు.



కబడ్డీ పోటీలకు సిద్ధమైన అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మైదానం

ఇదిలా ఉండగా పోటీల నిర్వహణకు సంబంధించి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 26 జట్లు ప్రాతినిథ్యం వహించనుండగా.. 400 మంది వరకు క్రీడాకారులు, ఆయా టీమ్‌ల కోచ్ అండ్ మేనేజర్‌లు హాజరుకానున్నారు. వారికి అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్వతీపురంలో ఆర్చరీ పోటీలు..

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు పార్వతీపురంలో ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు అండర్–14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలు తలపడనున్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలగానే నిర్వహిస్తుండగా... 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ముమ్మర ఏర్పాట్లు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు ప్రాంతాల్లో రెండు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–17 విభాగంలో కబడ్డీ పోటీలు, పార్వతీపురంలో అండర్–14,17 విభాగాల్లో ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరుకానున్నారు. వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు పోటీలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీల నిర్వహణకు జిల్లా ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం మరువలేనిది.


– లెంక వెంకటరమణ, కార్యదర్శి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విజయనగరం

రాజాం అభివృద్ధిపై జీఎంఆర్‌తో సమీక్ష

రాజాం: రాజాం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంథి మల్లిఖార్జునరావుతో ఎమ్మెల్యే కంబాల జోగులు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు సమీక్ష నిర్వహించారు. జీఎంఆర్ ఐటీ గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ వ్యవస్థ బాగుందని అన్నారు. రాజాం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు రహదారిపై మాట్లాడారు. మేదరవీధి వద్ద రోడ్డు సమస్యను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, తన వంతు సాయం అందిస్తామని వెల్లడించారు. అక్కడి రోడ్డు పక్క నిర్వాసితులకు వేరే ప్రాంతం వద్ద స్థలాలు చూపించే కార్యక్రమం చేద్దామని అన్నారు. నియోజకవర్గ పరిధిలో వంగరలోని సంగాం దేవాలయ అభివృద్ధికి తన వంతుగా రూ. 5 లక్షలు సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆలయానికి ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించగా డిపాజిట్ రూ.20 లక్షలు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ డిపాజిట్‌కు సంబంధించి రూ. 5 లక్షలు ఇస్తున్నట్లు జీఎంఆర్ పేర్కొన్నారు. కొండంపేట నుంచి జీఎంఆర్ ఐటీకి బీటీ రోడ్డు నిర్మాణంపై మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఇటీవల వేగవంతం అయ్యిందని, ప్రభుత్వం రాజాంలో రోడ్డు విస్తరణపై దృష్టి సారించడం అభినందనీయమని జీఎంఆర్ ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. సమీక్షలో రాజాం టౌన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, జీఎంఆర్ పీఏ అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు దక్కిన గౌరవం

- ప్రజా క్షేత్రానికి ప్రభుత్వ సేవలు అందించడంలో ముందంజ
- జాతీయ స్కోచ్ అవార్డుల ప్రదానంలో విజయనగరానికి చోటు
- రజిత పతకాన్ని కైవసం చేసుకున్న విజయనగరం కార్పొరేషన్



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు దక్కిన స్కోచ్ రజిత పతకం

విజయనగరం: దేశ వ్యాప్తంగా నిర్వహించిన స్కోచ్ అవార్డుల ఎంపికలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందించే విధానంలో శతశాతం నిర్వహణతో పాటు, పారదర్శకంగా అందించే విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ మేరకు స్కోచ్ అవార్డుల కమిటీ శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్ కమిషనర్‌కు లభించిన రజిత పతకాల వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో విజయనగరం కార్పొరేషన్ స్కోచ్ అవార్డుల ఎంపికలో రజిత పతకాన్ని సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న విజయనగరం కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తర్వాత అరుదైన గౌరవాన్ని దక్కించుకుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఉద్యోగుల సహాయ సహకారాలతోనే ఈ అవార్డు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి అవార్డులు సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ యంత్రాంగంలో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. కార్పొరేషన్ సిబ్బందితో బాధ్యత మరింత పెరగనుందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

పౌరాణిక కళాకారుడు రామారావు మృతి



చీకటి రామారావు (ఫైల్)

రాజాం : పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు చీకటి రామారావు(78) శుక్రవారం మృతి చెందారు. ఈయన స్వగ్రామం తెర్లాం మండలం చీకటిపేట గ్రామం కాగా, డైట్ శిక్షణ అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి, రాజాంలో అమ్మవారి కాలనీలో స్థిర నివాసిగా ఉండిపోయారు. ఓ వైపు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూ మరో వైపు పౌరాణిక నాటక రంగాల్లో రాణించేవారు. కృష్ణుడుగా, అర్జునుడు, శ్రీరామునిగా, నక్షత్రునిగా ఎన్నో పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ఎంతో మంది రాష్ట్ర కళాకారుల సరసన నటించారు. మూడువేలకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఈయన నటనకు మూడు పర్యాయాలు నంది అవార్డు లభించింది. ఈయనకు భార్య పద్మావతితో పాటు ఒక కుమారుడు కన్నబాబు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామారావు మృతి వార్త తెలుసుకున్న ఆయన అభిమానులు, స్నేహితులు వందలాదిగా రాజాం చేరుకొని ఆయనకు నివాళులర్పించారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో పాటు పలువురు రంగస్థల కళాకారులు ఈయన మృతికి సంతాపం తెలిపారు.

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన
- అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- వైద్యశిబిరాల నిర్వహణ

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంలో ఆలయ, జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. జాతర ఏర్పాట్లను జేసీ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చదురుగుడి, వనంగుడి క్యూలను పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి క్యూ పద్ధతిలో పంపించే విధానాన్ని డీఎస్పీ సుభాష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జాతరకు అధికసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈఓ రాధాకృష్ణను ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్యపనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. భక్తులు ఒకేచోట రద్దీగా లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేమలత, సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ పైడిరాజు, ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, దేవదాయశాఖ సిబ్బంది మురళీనాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటాలకు పూజలు

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలకు భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపుకుంకుమలు సమర్పించారు. అమ్మవారి ఘటాల్లో పండ్లు, కానుకలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు.



జాతర ఏర్పాట్లపై అధికారులుతో చర్చిస్తున్న జేసీ ఆనంద్

24 గంటలూ వైద్యసేవలు

శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు 24 గంటలూ వైద్యసేవలందిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు తెలిపారు. శంబర పిహెచ్‌సీను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రఘు, కిరణ్‌తోపాటు, సిబ్బందితో మాట్లాడారు. జాతరకు లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశమున్నందున వైద్యసేవలు సక్రమంగా అందించాలన్నారు. భక్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యసేవల కోసం 9 మంది వైద్యాధికారులను నియమించామని, షిఫ్ట్ పద్ధతిలో సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తారన్నారు. 108 అంబులెన్స్‌లు రెండు, 104 ఒకటి, ఫీడర్ అంబులెన్స్‌లు 5 అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వనంగుడి, రామాలయం, చదురుగుడి క్యూ, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ దవళ భాస్కరరావు ఉన్నారు.



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ జగన్నాథరావు